కథ

# ప్రవహించిన తొలి నెత్తురు

గన్నవరపు నరసింహమూర్తి

**గ్రీష్మం! తీక్షణం అయిన ఎండకి భయపడి మా పల్లెలో మా యింటి ముందు వేపచెట్టు క్రింద పేపరు చదువుతుండగా పోస్ట్‌మాన్ వచ్చి ఒక ఉత్తరాన్ని యిచ్చి వెళ్లిపోయాడు. ఆత్రంగా అది ఎక్కడి నుంచి వచ్చిందో చూశాను. అది రవి నాకు రాసిన ఉత్తరం! తను ఎన్నాళ్ల నుంచో ఎదురు చూస్తున్న ఉత్తరం!**

**ప్రియమైన అన్నయ్యకు,**

**రవి నమస్కరించి వ్రాయునది. నువ్వు పంపిన డబ్బు మొన్ననే అందింది. నా చివరి సంవత్సరం పరీక్షలు నిన్నటితో పూర్తయ్యాయి. ఇంక నా చదువు అయిపోయినట్లే; నా చదువుపూర్తైన తరువాతే నీ దగ్గరకు రమ్మనీ యిదివరకు నువ్వు వ్రాయడం వల్ల యిన్నాళ్లూ మన ఊరు రాలేక పోయాను. నిజానికి నిన్ను చూడాలనీ, నీతో చాలా విషయాలు మాట్లాడాలనీ ఉన్నా నీ మాట కాదనలేక యిన్నాళ్లు ఆగాను. నా పరీక్షలు అయిపోయాయి కాబట్టి నేను రేపే బయలుదేరి మన ఊరు వస్తున్నాను. త్వరగా వచ్చి నీతో ఎన్నో మాట్లాడాలని ఉంది. ఎల్లుండి నువ్వు స్టేషన్‌కి రావలెను.**

**తమ్ముడు 'రవి'**

ఆ ఉత్తరం చదివిన నా హృదయం మూగబోయింది. ఈరోజు చాలా శుభదినం. రెండు సంవత్సరాల నుంచీ ఈరోజు కోసం చకోరపక్షిలా ఎదురు చూస్తున్నాను. రవి చదువు త్వరగా పూర్తవ్వాలనీ, ఈ రెండేళ్లు నేను మొక్కని దేవుడు లేడు.

ఎందుకో ఈ ఉత్తరం చదవగానే నాకు మిత్రా గుర్తుకు వచ్చాడు. అమానుషంగా అతన్ని లాకప్‌లో మా వాళ్లు పెట్టిన చిత్రహింసలు గుర్తుకొచ్చాయి. మృత్యువుతో పోరాడి అతను హాస్పిటల్‌లో చనిపోయిన దృశ్యం మనసులో కదలాడింది. చివరగా అతను చనిపోయే ముందు నేను అతనికి యిచ్చిన మాట గుర్తుకొచ్చింది.

నిజానికి నేను మిత్రాకు చాలా అన్యాయం చేశాను. దానికి నేను ఎవరికీ జవాబుదారీ కాకపోవచ్చు కానీ నా మనస్సాక్షికి నేను జవాబుదారీ.

నాకు రెండేళ్ల క్రితం జరిగిన గతం గుర్తుకు రాసాగింది.

***


రెండేళ్ల క్రితం నేను చింతపల్లిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తుండేవాడిని. అప్పట్లో ఆ ప్రాంతంలో నక్సల్స్ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వాళ్లపై ప్రభుత్వం నిషేధం విధించడం వల్ల వాళ్ల కదలికల్ని మేము నిరంతరం గమనించవలసి వచ్చేది. ప్రభుత్వ యంత్రాంగం లోపాలవల్ల నైతేనేమీ, కొందరు అవినీతిపరులైన ఉద్యోగుల వల్లనైతేనేమీ పేద గిరిజనులకు ప్రభుత్వ సాయం అందేది కాదు. దళారీలు వాళ్లను మోసం చేస్తుండే వారు. అందుకోసం అమాయకులైన గిరిజనులు నక్సల్స్ సహాయం తీసుకోవడం జరుగుతుండేది. కానీ అది చట్ట వ్యతిరేకం కాబట్టి గిరిజనులకీ, నక్సల్స్‌కీ మధ్య మా పోలీసు యంత్రాంగం నలిగిపోతుండేది.

ఆరోజు నేను స్టేషన్‌లో డ్యూటీలో ఉండగా పిడుగులాంటి వార్త అందింది. ఇక్కడికి యిరవై కిలో మీటర్ల దూరంలోని రావిగూడ సంతలో నక్సల్స్ సంచరిస్తున్నారన్న సమాచారం తెలుసుకొని అక్కడికి వెళ్తున్న మా పోలీసు బృందం ప్రయాణిస్తున్న జీపుని నక్సల్స్ పేల్చివేసారన్న వార్త అది. వెంటనే నేను ఎస్పీకి ఆ విషయాన్ని తెలియచేసి ఆ దుర్ఘటన జరిగిన ప్రదేశానికి బయలుదేరాను.

జీపుని పేల్చివేసిన ప్రదేశం దట్టమైన అడవిలో ఉంది. అక్కడికి చాలా కష్టపడి చేరుకున్నాను. చూస్తే అక్కడి వాతావరణం చాలా బీభత్సంగా ఉంది. ఆ బ్లాస్టులో మా కానిస్టేబుళ్లు ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. డ్రైవరు, మరో యిద్దరు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు. వాళ్లని వెంటనే విశాఖపట్నం కే.జి హాస్పిటల్‌కి తరలించి, దానికి కారకులైన ఆ నక్సల్స్ వేటని ముమ్మరం చేశాను.

ఆ సాయంత్రానికి ఒక పోలీసు ఇన్ఫార్మర్ ద్వారా మరికొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసాయి. నక్సల్స్ మా బృందం ప్రయాణిస్తున్న జీపుని పేల్చివేసిన తరువాత అక్కడికి దగ్గరలోని రావిగూడలో తలదాచుకున్నారని అతను చెప్పాడు. ఆ విషయాన్ని నిర్ధారణ చేసుకునేందుకు నేను మా ఎస్పైతో కలిసి ఆ గ్రామానికి వెళ్లి విచారణ ప్రారంభించాను. అప్పటికే మా గ్రేహౌండ్స్ దళాలు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాల్ని జల్లెడపట్ట సాగాయి. మేము రావిగూడ వెళ్లేసరికి మిట్ట మధ్యాహ్నం అయింది. పట్టుమని యాభైమంది కూడా లేని ఆ గిరిజనగూడెం ఎత్తైన కొండమీద ఉండడం వల్లనూ, ఆ ఊరికెళ్లే దారి కాలిబాట కావడం వల్లనూ ఆ ఊరు చేరడానికి మేము ఎన్నో వ్యయప్రయాసలు పడవలసి వచ్చింది. ఎవరు చెప్పారో ఏమో కానీ మేము వస్తున్న వార్త ఆ గూడెం ప్రజలకు ముందే తెలిసి చాలామంది భయంతో ఊరు విడిచి వెళ్లిపోయారు. ఆ గూడెంలో శ్మశాన వాతావరణం నెలకొని ఉండడం వల్ల ఏం చెయ్యాలో నాకు తోచలేదు.

అందుకే విషయ సేకరణ నిమిత్తం ఆ గూడెం సర్పంచ్ రామన్నదొర యింటికి వెళ్లేను. ఆ రోజు అతను పూర్తిగా త్రాగి ఉండడం వల్ల మాతో మాట్లాడే స్థితిలో లేదు. చివరకు అతని భార్య, బిడ్డ కనుగదమాయిస్తే అంతకు మునుపురాత్రి నక్సలైట్లు తమ గ్రామం వచ్చారన్న విషయం నిజమని ఒప్పుకుంది. ఏ యింట్లో తలదాల్చుకున్నారన్న విషయం గురించి అడిగితే ఆ ఊరికి చివరి ఉన్న స్కూల్లో గడిపారని చెప్పింది.



అప్పటికి సమయం నాలుగు గంటలైంది. సూర్యుడి ఎండతీక్షణం తగ్గడంతో స్కూలు వైపు బయలుదేరాం. స్కూలు ఆ గూడెంకు చివరలో ఉంది. స్కూలంటే అదేమీ పక్కా భవనమేమీ కాదు. ఒక పూరిపాక లోనే దాన్ని నడుపుతున్నారు. మేము వెళ్లేముందే స్కూలుని విడిచి పెట్టినట్లున్నారు. ఆ ప్రాంతం అంతా నిర్జనంగా, నిశ్శబ్దంగా ఉంది. ఆ స్కూలు ఆవరణలో యిద్దరు విద్యార్థులతో చెట్లకు నీళ్లు పోస్తూ కనిపించాడు. ఆ స్కూలులో పనిచేస్తున్న సింగిల్ టీచర్ సంఘమిత్ర.

మమ్మల్ని చూడగానే నీళ్లు పోయడం ఆపి మా దగ్గరకు వచ్చాడు. ఆ యిద్దరు విద్యార్థులనీ వెళ్లిపొమ్మనీ అతను సంజ్ఞచెయ్యడంతో వాళ్లు మమ్మల్ని భయంగా చూస్తూ గూడెంవైపు వెళ్లిపోయారు. ఆ తరువాత ఆ ఆవరణలోనే ఉన్న చెట్టు క్రింద కూర్చొని వివరాలు అడగటం మొదలు పెట్టాను.

''మిత్రా గారూ! నిన్న మా పోలీసు జీపుని నక్సల్స్ పేల్చివేశారన్న విషయం మీకు తెలుసనుకుంటాను. కానీ దాన్ని పేల్చివేసిన నక్సల్స్‌కి మీరు యిక్కడే నిన్న రాత్రి ఆశ్రయం యిచ్చారని మీ గూడెం వాళ్లు చెప్పారు. యిది నిజమేనా?'' ప్రశాంతంగానే అతన్ని అడిగాను. ఆ మాటలు విన్న అతని ముఖంలో స్పష్టంగా కనిపించిన ఆందోళనని నేను గమనించాను. అతను చెప్పడం మొదలు పెట్టాడు.

''నేను ఈ గూడెంలోని స్కూల్లో టీచరుగా జాయినై మూడేళ్లయింది. అప్పట్నుంచీ నక్సల్స్ గురించీ వినడమే గానీ ఎప్పుడూ వాళ్లని చూడడం తటస్థించలేదు. నేను ఈ ఊళ్లో తలదాచు కునేందుకు వేరే యిల్లు లేక పోవడం వల్ల ఈ స్కూల్లోనే ఉంటున్నాను. నిన్న రాత్రి ఎనిమిది గంటలకు ఐదుగురు వ్యక్తులు వచ్చీ తమకి ఆశ్రయం యిమ్మని అడిగారు. కానీ రాత్రిపూట అందునా ఎత్తైన ఈ కొండలమీద ఉన్న ఈగూడెంలోని ఈ స్కూలుకి నాగరీకులుగా ఉన్న యువకులు ఎందుకు వచ్చారన్న విషయం నాకాశ్చర్యం కలిగించింది. బహుశా వాళ్లు నక్సలైట్లేమోనన్న అనుమానం కూడా కలిగించింది. కానీ వాళ్లకు నేను ఆశ్రయం యివ్వలేను అని చెప్పగలిగే బలమైన స్థితిలో లేక పోవడం వల్ల తప్పనిసరై వాళ్లకు ఆశ్రయం యిచ్చాను. కాకపోతే వాళ్లకీ నేను భోజన సదుపాయాలేవీ కల్పించలేదు. వాళ్లు తాము తెచ్చుకున్న బిస్కట్లని తిని, ఆ రాత్రి పడుకొని తెల్లవారే వెళ్లిపోయారు'' జరిగిన విషయాన్ని ఏకరువు పెట్టాడు.

కానీ అతను చెప్పిన విధానం, అతని హావభావాల వల్ల అతను ఏదో దాస్తున్నట్లు నాకు అనుమానం కలిగింది. అతని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. దేనికో అతను భయపడుతున్నట్లు నాకనిపించింది. అతన్ని జాగ్రత్తగా డీల్ చెయ్యగలిగితే అతని చేత నిజం చెప్పించవచ్చని ఒక నిర్ధారణకి నేను వచ్చాను. ఒక వేళ వాళ్లు నక్సల్స్ అని తెలిసినా ఆశ్రయం యిస్తే మాత్రం అతను నేరస్థుడే! ఎందుకంటే ప్రభుత్వోద్యోగిగా నిషేధించబడ్డ నక్సల్స్‌కి స్కూల్లో ఆశ్రయం యివ్వడం పెద్దనేరం! అదే నిజమైతే యితన్ని వదలకూడదు; చట్ట ప్రకారం శిక్షించాల్సిందే! అదే విషయాన్ని అతన్ని అడిగాను; కానీ వాళ్లు నక్సల్సన్న విషయం తనకి తెలీదు అని చెప్పిందే చెబుతుండడంతో నా కోపం తారాస్థాయికి చేరుకుంది. కోపంతో ఊగిపోతూ ''మిస్టర్ మిత్రా! మీరు చాలా పెద్ద తప్పుచేశారు. మిమ్మల్ని క్షుణ్ణంగా యింటరాగేట్ చెయ్యాలి; ఈ కేసు ముందు కెళ్లాలంటే మీరు నిజం చెప్పాలి; అందుకే ఈ క్షణమే మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను. తక్షణం మీరు మాతో మా స్టేషన్‌కి రావలసి ఉంటుంది'' నిర్దాక్షిణ్యంగా, కరకుగా అతనితో చెప్పాను. ఆ రాత్రికి అక్కడికి దగ్గర్లోని మా అవుట్ పోస్ట్‌కి మిత్రాని తీసుకెళ్లాము.

ఆ అవుట్‌పోస్ట్‌కి మేము వెళ్లే సరికి అక్కడి వాతావరణం చాలా భయానకంగా ఉంది. చనిపోయిన కానిస్టేబుళ్ల భార్యలు, పిల్లల ఏడుపులతో హోరెత్తిపోతోంది ఒక వైపు. యింకో వైపు ఈ పేల్చివేత ఎలా జరిగిందని, దీనికి పోలీసు శాఖ వైఫల్యమే కారణమా అనీ జర్నలిస్టుల ప్రశ్నల పరంపర... ఇవేకాక ఎస్పీ నుంచీ డిజిపి దాకా పైఅధికారులకీ ఫోనులో సమాధానాలు చెప్పవలసి రావడం... యిలా నా పని అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. నా పై క్షణక్షణానికి ఒత్తిడి పెరగ సాగింది. ఆ పేల్చివేతకు కారణమైన తీవ్రవాదుల్ని పట్టుకుంటే కానీ ఈ సమస్యకు పరిష్కారం దొరికేటట్టులేదు.

అలా వాళ్లని పట్టుకోవాలంటే మా దగ్గరున్న ఒకే ఒక్క ఆధారం... మిత్రా! అవును; అతను నిజం చెబితేనే ఈ కేసు ఒక కొలిక్కి వస్తుంది. కానీ అతను నాకు తెలియదన్న విషయం తప్పితే మరో ముక్క మాట్లాడటం లేదు. ఆ రాత్రి మిత్రా చేత నిజం కక్కించాలనీ మా వాళ్లకి ఆదేశాలు జారీ చేశాను; అవసరమైతే థర్డ్ డిగ్రీ... అదే లాఠీ ప్రయోగం జరిపైనా సరే!

ఆ ఆదేశం మా వాళ్లపై మంత్రంలా పని చేసింది. వాళ్లు ఆ రాత్రి రెచ్చిపోయారు. ఆ రాత్రి మిత్రాకు కాళరాత్రే అయింది. వాడి శరీరం మీద లాఠీలు నాట్యం చేశాయ్. తెల్లవారేసరికి మా వాళ్లు కొట్టిన దెబ్బలకు మిత్రా తెలివి తప్పి స్పృహ కోల్పోయాడు. తెలతెల వారుతుండగా మా కానిస్టేబుల్ ఒకడొచ్చీ వాడు తెలివితప్పిన విషయాన్ని చల్లగా చెప్పాడు. ఆ వార్త విన్న నా మస్తిస్కం మొద్దు బారిపోయింది. అసలే మా వాళ్లు చనిపోయి పీకల్లోతు సమస్యల్లో కూరుకుపోయిన నాకు మళ్లీ యిదో తలనొప్పి?! మిత్రాగానీ లాకప్‌లో చనిపోతే యింకో అప్రతిష్ట! వెంటనే జీప్ యిచ్చీ అతన్ని విశాఖపట్నానికి తరలించాను. వాడికెలాగైనా మంచి హాస్పటల్‌లో ట్రీట్‌మెంట్ యిప్పించమనీ చెప్పి మరీ పంపించాను.

అతన్ని హాస్పిటల్‌లో జాయిన్ అయితే చేశాము కానీ వాడిప్రాణాల్ని మాత్రం కాపాడలేకపోయాం. అతని ప్రాణాల్ని అక్కడి డాక్టర్లు విశ్వప్రయత్నం చేసి మరో రెండు రోజులే కాపాడ గలిగారు. మూడో రోజు అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.... చాలా దారుణం జరిగి పోయింది. మా వాళ్లు కొట్టిన దెబ్బలకి మిత్రా అన్యాయంగా చనిపోయాడు. దానికి నేనే ఒక రకంగా కారణం.



ఒక రకంగా యిది నేను చేయించిన హత్య! నేను నిజంగా ఒక మృగంలా ప్రవర్తించాను.

***

మిత్రా చావు వార్త నన్ను విపరీతంగా కదిలించి వేసింది. చాలా తప్పు పని చేశాననిపించింది. మరో రెండురోజుల తరువాత అతని అంత్యక్రియలు కూడా జరిగిపోయాయి. ఆ రోజు మధ్యాహ్నం మా కానిస్టేబుల్ ఒకరొచ్చి మిత్రా నా పేరు మీద వ్రాసిన ఉత్తరం యిచ్చి వెళ్లిపోయాడు. ఆత్రంగా దాన్ని చదవడం మొదలు పెట్టాను.

హరినారాయణగారికి,

సంఘమిత్ర వాయునది. నాకు ఆ నక్సల్స్ గురించి ఏమీ తెలియదని నేను ఎంతచెప్పినా మీరు వినకుండా నేను దోషినని నమ్మి నాచేత లేని నిజాన్ని చెప్పించాలన్న మీ శ్రమ వృధా అయినం దుకు నేను విచారిస్తున్నాను. ఎందుకంటే అందులో వాస్తవం లేదు కాబట్టి.

కానీ ''నిజా''నికి ఒక పెద్ద దురలవాటు ఉంది. అది ఎప్పుడూ ఆలస్యంగానే బయటకొస్తుంది. ఈలోగా ఎన్నో ఘోరాలు జరిగి పోతుం టాయ్. దానికి నేనే ప్రత్యక్ష ఉదాహరణ. దాని ఆలస్యానికి నేను కూడా బలైపోయాను. ఇంక నేను బ్రతకడం కష్టం. నా జీవితం చర మాంకానికి చేరుకుంది. నిజం బయటపడి నేను నిర్దోషిననీ లోకానికి ఎలుగెత్తిచాటాలనీ, అందు కైనా కొంతకాలం బ్రతకాలనీ మృత్యువుతో అలుపు లేని పోరాటమే చేశాను నేను. కాని విధి లీల! మృత్యువే గెలవ బోతోంది! అయినా నిజం ఎప్పుడూ నిజమే; దాన్ని తాత్కాలికంగా దాచగలం; కానీ శరవేగంగా మళ్లీ అది అంకురంలా బయటకు రాక తప్పదు. అందుకే చనిపోయేముందు ఆ నిజం మీకు చెప్పాలనే నా శరీరం సహకరించకపోతున్నా గుడ్డివెలుతుర్లో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఎందు కంటే నిజం ఎంత గొప్పదో జనానికి తెలియాలి.

ఆ రాత్రి వచ్చింది నక్సలైట్లు అనీ వాళ్లు వెళ్లిన మర్నాడు తెలిసింది. వెంటనే మీకు రిపోర్ట్ యివ్వా లనీ అనుకున్నాను. కానీ ఆ గూడెం ప్రజలు నా ప్రయత్నానికి అడ్డు తగిలారు. ఎందుకో తెలుసా

సార్! వాళ్ల దృష్టిలో నక్సల్స్ అంటే దేవుళ్లు; వాళ్లకి సహాయం చేసే అన్నలు. ఈ అన్యాయపు ప్రభుత్వ ఉద్యోగుల నుండీ, అవినీతి వ్యవస్థ నుంచీ వాళ్లని కాపాడేది ఆ అన్నలే; వాళ్లే గానీ లేకపోతే ఒక్క తండా కూడా యివ్వాళ మిగిలి ఉండేది కాదు.

ఇంతకీ వాళ్లు మీ పోలీసు జీపును ఎందుకు పేల్చారో తెలుసా?! అందులో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లు ఆ చుట్టుప్రక్కల తండాల్లో ఎందరో యువకుల్ని అన్యాయంగా అరెస్ట్ చేసి తీసికెళ్లి పోయారు. వాళ్ల ఆచూకీ యిప్పటిదాకా ఎవరికీ తెలియదు. అదీగాక నెల రోజుల క్రితం రావిగూడెంకి చెందిన యిద్దరు గిరిజన యువతుల్ని గంజాయి అమ్ముతున్నారంటూ పోలీసు స్టేషన్‌కి తీసికెళ్లి మానభంగం చేసి వదలిపెట్టారు. ఆ పోలీసులు కూడా ఆ జీపులోనే ఉన్నారు. ఇదేమని ఆ గూడెం ప్రజలు అడిగితే వాళ్లని కూడా అరెస్ట్ చేసి పదిహేను రోజుల పాటు లాకప్పులో పెట్టారు.

ఈ విషయాలు ఆ గూడెం ప్రజలు అన్నలకి చెప్పడంతో వాళ్లు సమయం కోసం వేచి చూసి మొన్న మీ జీపుని పేల్చివేశారు. యిలాగే ఈ ఏజెన్సీలో ఎన్నోఘోరాలు జరుగుతున్నాయ్! వీటిని పరిష్కరించవలసిన మీ పోలీసు శాఖ రక్షక వ్యవస్థగా కాక భక్షక వ్యవస్థగా వ్యవహరిస్తుండ బట్టే ఈ ఘోరాలు జరుగుతున్నాయ్!

అలాఅని వాళ్లు జీపుని పేల్చివేయడాన్ని నేను సమర్థించడం లేదు. కానీ యిలా ఎందుకు జరుగుతుందో ఆలోచించమంటున్నాను. దానికి మూలాలు వెతకమంటున్నాను. లేకపోతే ఈ నరమేధం ఆగదు. మీ దగ్గర న్యాయం జరగకపోతే ఆ అమాయక గిరిజనులు వాళ్ల దగ్గరకు వెళ్లక తప్పదు; ఆ అవసరాన్ని మీరే కలిగిస్తున్నారు; అందుకు ఈ సాయుధ పోరాటాలు? అందుకే మీ భాషలో ఎన్‌కౌంటర్లు? అలా అనీ అందరు పోలీసులూ అలాంటి వారేననీ అనటం లేదు; తొంభై శాతం మంది పోలీసులు తమ విధిని ఎంతో క్రమశిక్షణతో నిర్వహిస్తున్నారు. మిగతా పది శాతం మంది వల్లే ఈ అరాచకాలు జరుగుతున్నాయ్; మీ పోలీసుశాఖకు చెడ్డపేరు వస్తోంది.

మీ యిద్దరి అంతులేని పోరాటల మధ్య నాలాంటి టీచర్లు నలిగి పోతున్నారు. యిప్పటికైనా ఈ అన్యాయాల్ని రూపుమాపండి సార్! మీ శాఖని ప్రక్షాళన చెయ్యండి. ఎక్కడో కీకారణ్యాల మధ్య కొండల మీద నాగరిక ప్రపంచానికి దూరంగా ఉంటున్న ఈ అమాయక గిరిజనులను ఆదుకోవలసిన అవసరం ఉంది. లేకపోతే ఎంతో అపురూపమైన ఈ జాతి అంతరించిపోయే ప్రమాదం ఉంది. వాళ్లకు కూడా అందరిలాగే బ్రతికే హక్కు ఉంది. వాళ్లు కూడా మన సోదరులే. వాళ్లకి గానీ న్యాయం జరిగితే ఈ నక్సల్స్ ఉండరు; ఈ మందుపాతర పేలుళ్లు, ఎన్‌కౌంటర్లు ఉండవు.

చివరగా నా కోరిక ఒక్కటే; నేను ఎంతో ఆశతో ఈ గిరిజనులకు చదువు చెప్పి వాళ్లలో చైతన్యం తేవాలనీ ఎన్నోకలలు కనీ ఎవ్వరూ ఈ గిరిజన తండాల్లో పని చెయ్యడానికి ముందుకు రాకపోయినా నేను ముందుకొచ్చీ యిక్కడ జాయిన్ అయ్యాను. కానీ నా కల తీరకుండానే నా జీవితాన్ని అర్ధంతరంగా ముగిస్తున్నాను. కానీ దురదృష్టవశాత్తూ నాకో తమ్ముడున్నాడు. వాడికి నేను తప్ప ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. వాడు ఢిల్లీలోని పూసా ఎగ్రికల్చర్ కాలేజీలో ఎగ్రి కల్చర్ బీయస్సీ చదువుతున్నాడు. వాడింకా రెండేళ్లు చదవాలి. అందుకే నేను చనిపోయే ముందు మిమ్మల్నో కోరిక కోరుతున్నాను.

నేను చనిపోయినట్లు వాడికి తెలియపరచొద్దు. ఎలాగైనా మీరు రాబోయే రెండు సంవత్సరాలు డబ్బులు పంపి వాడి చదువు పూర్తయ్యేట్లు చూడండి. వాడి చదువు మా నాన్నగారి కల; అది నిజమవ్వాలి... అది నేను చనిపోవడం వల్ల అర్ధాంతరంగా ఆగిపోరాదు. వాడి చదువు పూర్తైన తరువాత నిజం తెలిసినా ఫరవాలేదు. నేను చనిపోయే ముందు కోరుతున్న ఈ కోరికను మీరు తీరుస్తారని ఆశిస్తూ.

-సంఘమిత్ర

సుదీర్ఘంగా వ్రాసిన ఆ ఉత్తరం నాలో కలకలం రేపింది. అంతర్మధనానికి గురి చేసింది. నేను చేసిన ఈ తప్పుకు శిక్ష అనుభవించక తప్పదు. ఎవ్వరూ నేను చేయించిన హత్య గురించి కోర్టులో సాక్ష్యం చెప్పక పోవచ్చు. నాకు శిక్ష పడక పోవచ్చు. కానీ నా మనస్సాక్షి! దీనికి నేను జవాబు చెప్పి తీరాలి!

తరువాత సంఘటనల్నీ త్వరత్వరగా చోటు చేసుకున్నాయి. నా ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి నా భార్యతో సహా మా పల్లెకు వెళ్లిపోయాను. రెండేళ్ల నుంచీ అక్కడే ఉంటూ అజ్ఞాత వాసం చేస్తున్నాను. మిత్రా తమ్ముడు రవికి చదువు పూర్తయ్యే దాకా నా దగ్గరకు రావద్దనీ మిత్రా పేరు మీద ఉత్తరం వ్రాసి, అక్కడ నుంచీ అతనికి నెల నెలా డబ్బు పంపసాగాను. అప్పటి నుంచీ చదువు పూర్తైందని అతను వ్రాసే ఉత్తరంకోసం చకోర పక్షిలా ఎదురు చూస్తూ గడుపుతున్నాను. ఎలాగైతేనేం యిన్నాళ్లకు అతని నుంచి ఉత్తరం వచ్చింది. అతని చదువు పూర్తవడంతో మిత్రాకు నేనిచ్చిన మాట నెరవేర్చినట్లయింది. నాకుగా నేను విధించుకున్న శిక్ష పూర్తిగా అనుభవించి నట్లైంది. ఒక మంచి పని చెయ్యడంలో ఉన్న ఆనందం స్వానుభవం ద్వారా తెలుసుకున్నాను.

***

ఈ రోజు రవి మా పల్లెకొస్తున్న రోజు. ఉదయాన్నే వచ్చే రైలులో వస్తున్నాడు. అందుకే స్టేషన్‌కి ఎడ్ల బండిమీద బయలుదేరాను. మిత్రా ఈ ఊళ్లోనే పని చేస్తున్నట్లు నేను ఉత్తరాలు వ్రాస్తుండటంతో తన అన్నయ్యని చూడటానికి ఆత్రంగా వస్తున్నాడతను. మిత్రా చనిపోయిన విషయం యిప్పుడు చెప్పక తప్పదు. చెబితే ఆ విషయాన్ని విని అతను తట్టుకోగలడో లేదో?! అతను తనని క్షమిస్తాడో లేదో?! అతను తనను క్షమిస్తాడనే నేను గట్టిగా నమ్ముతున్నాను.

అప్పుడే తూర్పు సంధ్య ఎర్రబడి తొలి అరుణ కిరణం భూమిని ముద్దాడింది. నా బండి ఆ వెలుతురులో స్టేషన్‌వైపు పరుగులు తీస్తోంది. చీకటిలోంచి వెలుగు వైపు పయనం సాగుతోంది. నాకెందుకో యిప్పుడు ఏనాడో నేను చదివిన తిలక్ అమృతం కురిసిన రాత్రిలోని ఒక వాక్యం గుర్తుకొస్తోంది. "పులి చంపిన లేడినెత్తురు పులుముకోలేను, ఖడ్గ మృగోదగ్ర విరావం ఆలకించ లేను"; అది గుర్తొచ్చిన తరువాత అప్రయత్నంగా నా కంటి నుండి నీటి చుక్కలు రాలి పడ్డాయి. బండి రైల్వే స్టేషన్ వైపు సాగిపోతోంది. తమ సోమా జ్యోతిర్గమయ.

★

చిరునామా:
గన్నవరపు నరసింహమూర్తి,
ఇం.నెం.8-123/2, రవినగర్
నాయుడుతోట, వేపగుంట పోస్ట్,
విశాఖపట్నం - 530 047
సెల్: 94901 84254

